ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 16 జూన్, 2026 | పేజీలు : 08

## విద్యారంగంలో వెనుకబడుతున్న మెట్‌పల్లి




వివరాలు మెయిన్‌లో...

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు : కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ స్వామి , ఆర్‌డిఓ షర్మిల, కలెక్టరేట్ ఎఓ సుధాకర్ రెడ్డి తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 256 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 142,కరీంనగర్ నగరపాలిక సంస్థకు 60 వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ శాఖ, విద్యా శాఖల అధికారులతో మొదటి విడత రివ్యూ మీటింగ్ నిర్వహించామన్నారు. బుధవారం నిర్వహించే రెండో విడత మీటింగ్ కి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. మంగళవారం జెడ్‌పికార్యాలయంలో డిపిఒ, డిఆర్‌డిఒ అధికారులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్ కోర్టు కేసులు, దరఖాస్తులు, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని హేయ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఈవారం యాక్షన్ ప్లాన్, తనిఖీ రిపోర్టులను శుక్రవారం సాయంత్రం లోగా సమర్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాఖల వారీగా రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పేర్కొన్నారు.

# విద్యా సంస్థలు పునఃప్రారంభం

### బస్ పాసుల జారీకి నిర్మల్ డిపో సర్వం సిద్ధం !



**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు పునఃప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను తొలగించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ముందస్తు కసరత్తు ప్రారంభించింది. నూతన విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు రాయితీ మరియు ఉచిత బస్ పాసుల జారీ ప్రక్రియను నిర్మల్ డిపో సర్వం సిద్ధం చేసిందని డిపో మేనేజర్ కే.పండరీ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే అర్హులైన విద్యార్థులు ఎవరూ ఇబ్బంది పడకుండా ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు ఉచిత మరియు రాయితీ బస్ పాసుల వివరాలు, పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ఆర్‌టిసి సంస్థ భారీ ఊరటనిచ్చింది. 12 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పాఠశాల బాలురకు తమ స్వంత గ్రామం నుండి పాఠశాల ఉన్న ప్రాంతానికి 20 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే పూర్తి ఉచితంగా బస్ పాసులు అందజేయనున్నట్టు డీఎం వెల్లడించారు. అలాగే హైస్కూల్ విద్యార్థుల ప్రయాణ ఖర్చులను తగ్గించేందుకు 35 శాతం రాయితీతో కూడిన ప్రత్యేక బస్ పాసులను అందిస్తున్నట్లు ఆయన సూచించారు.

**విద్యా సంస్థల యాజమాన్యాలకు అడ్మినిస్ట్రేరియల్ ఫీజుల నిబంధనలు**

బస్ పాసుల ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించడానికి విద్యాసంస్థలు చెల్లించాల్సిన అడ్మినిస్ట్రేషన్ ఫీజుల వివరాలను డిపో మేనేజర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఎలాంటి అడ్మినిస్ట్రేషన్ ఫీజులు ఉండవని కేవలం ప్రైవేటు విద్యా సంస్థలు మాత్రమే ఈ రుసుములను డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ డిడిలను అకౌంట్ ఆఫీసర్, టిజిఎస్‌ఆర్‌టిసి, అదిలాబాద్ పేరు మీద మాత్రమే తీయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విద్యా సంస్థల కేటగిరీల వారిగా ఫీజుల వివరాలు ఇలా ఉన్నాయి. 500 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రైవేటు పాఠశాలలు కొత్త రిజిస్ట్రేషన్ కోసం రూ.2000 పాత దానిని నూతనీకరించుకోవడానికి (రెన్యూవల్) రూ. 1000 చెల్లించాలి. జూనియర్ కళాశాలలు, ఒకేషనల్, ఐటిఐ ,డిప్లొమా కోర్సుల యాజమాన్యాలు కొత్తగా అయితే రూ.5000 రినివల్ కోసం రూ.4000 చెల్లించాల్సి ఉంటుంది. డిగ్రీ కళాశాలలకైతే కొత్త రిజిస్ట్రేషన్‌కు రూ. 5000, రెన్యూవల్‌కు రూ. 5000 గా నిర్ణయించారు. ఇకపోతే ఉన్నత విద్యా సంస్థలైన ఇంజనీరింగ్, మెడిసిన్ కాలేజీల యాజమాన్యాలు కొత్తగా రూ. 7000, రెన్యూవల్ ప్రక్రియకు రూ. 5000 చొప్పున డిడిలను సమర్పించాల్సి ఉంటుంది.

**నిర్మల్ బస్టాండ్ లో యూజర్ ఐడిల పంపిణీ, కౌంట్ వేళలు**

నిర్ణీత ఫీజులతో కూడిన డిడిలను తీసుకుని విద్యా సంస్థల ప్రతినిధులు నిర్మల్ ప్రధాన బస్టాండ్‌ను సంప్రదించవచ్చు. అక్కడ కాలేజీ లేదా స్కూల్ లాగిన్ కోసం ప్రత్యేక యూజర్ ఐడి, పాస్‌వర్డ్‌లను పొందవచ్చుని, ఆ తర్వాతే విద్యార్థుల బస్‌పాస్ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి వీలవుతుందని డీఎం పండరీ వివరించారు. విద్యార్థులు,విద్యా సంస్థల ప్రతినిధుల సౌకర్యార్థం నిర్మల్ బస్టాండ్‌లోని బస్ పాస్ కౌంట్ ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు నిరంతరాయంగా సేవలు అందిస్తుందని, గడువు లోపల దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## రూపురేఖలు మారేలా ధర్మపురి బస్టాండ్ అభివృద్ధి






**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి ఆర్‌టిసి బస్ స్టాండ్ రూపురేఖలు మారేలా ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఆర్ టిసి కరీంనగర్ ఇడి సోలామన్, ఆర్ ఎం రాజు,జగిత్యాల డిపో మేనేజర్ లతో కలిసి మంత్రి సోమవా రం ధర్మపురి బస్టాండ్‌ను పరిశీలించారు.ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి ప్రతీరోజూ 4 నుండి 5 వేల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తున్నారని మంత్రి తెలిపారు. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక నిధులతో రెండు కొత్త ప్లాట్ ఫామ్‌లు ని ర్మిస్తామని,యాత్రికుల సౌకర్యార్థం బస్టాండులో త్రాగునీరు, పారిశ్యుధ్య ఏర్పాట్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రజలకు సౌకర్యంగా వుండేలా కొత్తగా 13 రూ ట్లలో బస్సులు నడిపేందుకు ఏర్పాట్లుచేస్తున్నామనిమంత్రితెలిపారు.

**మంత్రి అడ్లూరి చొరవతో ఆలయ స్వీపర్ల వేతనాలు పెంపు**

ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న 15 మంది స్వీపర్ల వేతనాలు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ప్రత్యేక చొరవతో 8,9 వేల నుండి 12 వేలకు పెరిగాయి.ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు ఉత్తర్వులు జారీచేశారు. పెరిగిన పారితోషకం పత్రాలను సోమవారం మంత్రి అడ్లూరి ఆలయ పారిశ్యుధ్య సిబ్బందికి అందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధర్మపురి లక్ష్మీ నృసింహుడి ఆలయంలో పనిచేస్తున్న స్వీపర్ల సేవలతో ధర్మపురి ఆలయానికి దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఎస్ఓ గుర్తింపు లభించిందని అన్నారు.స్వీపర్లతో పాటు ఆలయంలోని ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు.

## మొక్కల పేరిట లెక్కలు..?

### నాటిన మొక్కలు... ఎండిపాయే!పట్టించుకోని అధికారులు,కాంట్రాక్టర్
### ప్రజాధనం వృథాపై డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ ఆగ్రహం




**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని పట్టణంలో పచ్చదనం పడకేసింది. అభివృద్ధి,సుందరీకరణ పేరిట లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నాటిన మొక్కలు సంరక్షణ కరువై పూర్తిగా ఎండిపోయాయి.అధికారులనిర్లక్ష్యంకారణంగా పచ్చగా కళకళలాడాల్సిన డివైడర్లు ప్ర స్తుతంఎండుపుల్లలతోదర్శనమిస్తున్నా యి.

**నిర్లక్ష్యానికి నిలువుటద్దం:** పట్టణంలోని పాత పెట్రోల్ బంక్ నుండి గంగాపురి వరకు నూతనంగా నిర్మించిన రోడ్డు డివైడర్ లో... ముఖ్యంగా గిరిజన సంక్షేమ హాస్టల్,పవర్ ట్రాక్ షోరూమ్ ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డుపై గత కొన్ని నెలల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు మొక్కలు నాటించారు. అయి తే, నాటిన నాటి నుండి వాటికి నీరు పోయడం,సంరక్షణ చర్యలు చేపట్టడం పూర్తిగా విస్మరించారు. తీవ్రమైన ఎండల కారణంగా ఈ మొక్కలన్నీ ఎండిపోయాయి.

**లక్షల ప్రజాధనం వృథా :** ప్రభుత్వం ఒకపక్క పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటాలని ప్రచారం చేస్తుంటే, మరోపక్క క్షేత్రస్థాయిలో అధికారులు నాటిన మొక్కలను గాలికి వదిలేస్తున్నారు. ఒక్కో మొక్కకు రూ.500 నుండి రూ.1000 వరకు ఖర్చు చేశారని సమాచారం.

## ఇంటర్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందనలు



ప్రజాపక్షం/కరీంనగర్:ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని కదారి రశ్మితను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రశ్మితకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపిసి విభాగంలో మొత్తం 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించడం విశేషమని కలెక్టర్ కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థిని విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, రామడుగు సర్పంచ్ మొయిజ్, రామడుగు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో 'అమ్మ మాట – అంగన్వాడి బాట'

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లక్ష్మీ పూర్ ,దమ్మన్నపేట గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జానకి ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు సోమవారం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా మూడేళ్ల నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు .చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం ప్రాథమిక విద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జానకి మాట్లాడుతూ మూడేండ్లకు పైబడిన చిన్నారులందరినీ అంగన్వాడి కేంద్రాలకు పంపించడం వల్ల ఆట పాటలతో విద్యతోపాటు పౌష్టికాహారం ఆరోగ్య పరీక్షలు అన్ని కూడా అంగన్వాడి కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.చిన్నారులకే కాకుండా గర్భిణీలు బాలింతలకు కూడా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు.అనంతరం అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసం రాజశేఖర్ ,ముదం గౌతమి,సూపర్వైజర్ జానకి,పాఠశాల హెడ్మాస్టర్ రమేష్,ఉపాధ్యాయురాలు స్వాతి,అంగన్వాడి టీచర్లు తిరుమల,స్వప్న,రజిత,ఆశ కార్యకర్తలు లక్ష్మీ ,రాధ,ఆయాలు,పిల్లలు,తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

# రూపురేఖలు మారేలా ధర్మపురి బస్టాండ్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే చాలీచాలని వేతనాలతో ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు, కాంట్రాక్టు ఉద్యోగులు, రోజువారీ,తాత్కాలిక ఉద్యోగులు, ప్లంబర్లు,ఎలక్ట్రీషన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్, వాచ్మెన్ ల జీతాలను పెంచి అందించడం జరిగిందని మంత్రి తెలిపారు. వేతనాల పెంపుపై ప్రత్యేక కృషి చేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కు పారిశుధ్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, గ్రంథాలయ చైర్మన్ ఎస్.దినేష్,ఎఎంసి చైర్మెన్ చిలుముల లావణ్య లక్ష్మణ్,దేవస్థానం పాలకమండలి మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్,ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

**ఘనంగా ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో అడ్లూరి**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను సోమవారం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్ హెచ్ గార్డెన్లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ మృదు స్వభావి మల్లు భట్టి విక్రమార్క మరెన్నో జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధిలో భట్టి పాత్ర కీలకమని మంత్రి అన్నారు. కెసిఆర్ పాలన లో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను సక్రమ మార్గంలో పెట్టే పనిలో భట్టి విక్రమార్క తన చతురతను ప్రదర్శిస్తున్నారని మంత్రి అన్నారు.

# మొక్కల పేరిట లెక్కలు..!?

(మొదటి పేజీ తరువాయి)

ఇలా వందల సంఖ్యలో మొక్కలు ఎండిపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసలు మొక్కల పేరిట ఎలాంటి లెక్కలు రాశారోనన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**నిబంధనలు బేఖాతరు:** రోడ్డు కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం... కొత్తగా రోడ్డు వేసిన కాంట్రాక్టరే డివైడర్ లోని మొక్కలను కనీసం రెండేళ్ల పాటు సంరక్షించాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ ఇక్కడ కాంట్రాక్టర్ నిబంధనలను బేఖాతరు చేసినా, ప్రశ్నించే అధికారులే కరువయ్యారు.

**తక్షణ చర్యలకు డిమాండ్ :** ఎండిపోయిన మొక్కలను వెంటనే తొలగించి, వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని డ్రిప్ ఇరిగేషన్ లేదా వాటర్ ట్యాంకర్ల ద్వారా క్రమం తప్పకుండా నీరు పోసే ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొరెంకల సురేష్,స్థానిక ప్రజలు మున్సిపల్ కమిషనర్ ను,ఆర్.అండ్.బి అధికారులను కోరుతున్నారు.మొక్కల సంరక్షణ విషయంలో ఘోరంగా నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై, కాంట్రాక్టర్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు,పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాచిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా విద్యా పండుగ



ప్రజాపక్షం / గంగాధర : పాఠశాలల పునః ప్రారంభాన్ని పురస్కరించుకొని మండలంలోని కాచిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా విద్యా పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి విగ్రహ ఆవిష్కరణతోపాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో ఎంపిడివో దమ్మని రాము మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ అంబటి రజిత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో విజయాలు సాధించాలని సూచించారు. పిల్లల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. సర్పంచ్ కోల మమత శ్రీనివాస్ తన కుమార్తెను కార్పోరేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం అందరి ప్రశంసలు అందుకున్నారు. అలాగే ఉప సర్పంచ్ బైరి మహేందర్ రెడ్డి కుమార్తె ఇప్పటికే ఈ పాఠశాలలో చదువుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై వారు చూపించిన విశ్వాసం ఇతర తల్లిదండ్రులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆయన పాఠశాలకు ద్యూయల్ డెస్కులు, ఫ్యాన్లు అందించడంతోపాటు రెండు తరగతి గదుల మరమ్మత్తులు చేయించారు. అదేవిధంగా సరస్వతి విగ్రహాన్ని కూడా పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు డి.శాంత, ఏపిపిసీ చైర్మన్ గంకిడి సంధ్య రాంచంద్రారెడ్డి, మండల విద్యాధికారి డా.యెలిగేటి మల్లికార్జున్, ఏనుగు ప్రభాకర్ రావు, గ్రామ పెద్దలు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధులను వేధిస్తే చట్టపరమైన చర్యలు

### జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ



ప్రజాపక్షం/కరీంనగర్:ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ వ్యతిరేక చైతన్య దినోత్సవం (జూన్ 15) సందర్భంగా కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వెలిచాల గ్రామ శివారులోని స్పందన వృద్ధుల ఆశ్రమంలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ అనుమతితో, కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె. రాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, పెరుక రంగయ్య, ప్యానెల్ అడ్వకేట్ లు బాశెట్టి సమతా రాణి, నిషా సింగ్‌లు మాట్లాడుతూ సమాజంలో వృద్ధులపై జరుగుతున్న మానసిక, శారీరక వేధింపులను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృద్ధుల రక్షణ కోసం అమల్లో ఉన్న 'తల్లిదండ్రులు , వృద్ధుల పోషణ–సంక్షేమ చట్టం, 2007' గురించి వివరించారు. అలాగే ఆస్తులను వారసుల పేరున రాసిచ్చిన అనంతరం వారు మోసపూరితంగా వ్యవహరిస్తే, ఆయా రిజిస్ట్రేషన్లను రద్దు చేయించుకునే హక్కు కూడా వృద్ధులకు చట్టం కల్పించిందని స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా వృద్ధులకు అందుతున్న ఉచిత న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులకు కోర్టుల ద్వారా ఉచిత న్యాయవాది సేవలు అందిస్తామని తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు వంటి అంశాలను లీగల్ ఎయిడ్ కౌన్సెలింగ్, లోక్ అదాలత్‌ల ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. వృద్ధులు ఎలాంటి ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కొన్నా అధైర్యపడకుండా జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయాన్ని నేరుగా లేదా ఉచిత హెల్ప్‌లైన్ 15100 ద్వారా సంప్రదించి న్యాయ సహాయం పొందాలని సూచించారు. అనంతరం ఆశ్రమంలోని వయోవృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు మంచికట్ల శ్రీనివాస్, పారాలీగల్ వాలంటీర్లు శామీమ్, సుజాత, రవీందర్, ఆశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సుడా చైర్మన్ మాట్లాడుతూ బట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని ఈరోజు ఉప ముఖ్యమంత్రిగా వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, యం.డి. మిరాజ్, బత్తిని చంద్రాగౌడ్, మిర్యాల శ్రీధర్ రెడ్డి, లావణ్య రంగ, జ్యోతి రెడ్డి, మాలోత్ మహాలక్ష్మి, షబానా, అస్తపురం తిరుమల, అష్ఫఖ్ ఖురేషి, ముల్కల కవిత, యనమల మంజుల, ఎం.డి. నదీమ్, గుమ్మడి రాజ్ కుమార్, అనిల్, ఇమ్రాన్ పూసాల నారాయణ స్వామి, ఎం.డి షహన్నా, ఎం.డి అనిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం సందర్భంగా కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ (కాస్), వాసుదేవ హాస్పిటల్ అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137ఏ సంయుక్త ఆధ్వర్యంలో రేకుర్తితోపాటు కరీంనగర్‌లో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య అవగాహన కోసం వాక్‌థాన్ పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటడం, సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ జనరల్ సర్జన్లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా కాస్ అధ్యక్షుడు డా.ఎల గందుల శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెట్లను నాటడం ప్రతి పౌరుని బాధ్యత అని అన్నారు. రోగుల ఆరోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తున్న శస్త్ర చికిత్స నిపుణుల సేవలను గౌరవించడం, శస్త్ర చికిత్స రంగంలో నాణ్యత, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, రోగి భద్రత వైద్యుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ వారోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వి.మంగీలాల్, సాయిప్రసాద్, అరుణ్ కటారి, వై.నరేంద్ర, ప్రదీప్, మహేందర్, హరికృష్ణ, శైలేంద్ర, అనిల్, సుధీర్, రాజు, జితేందర్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ కంజర్ల మహేశ ఈద కుమారస్వామి, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ శర్మ, గాలిపల్లి నాగేశ్వర్, సాగర్ రెడ్డి, వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలందరూ ఈ నెల 20న జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని, కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సాధ్యమైనంతవరకు ఎక్కువ కేసుల పరిష్కారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, జిల్లా అదనపు ఎస్పీ డి.చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల ఇన్చార్జి కార్యదర్శి పి.లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి, వేములవాడ అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి మేఘన, మానేరు స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చింతోజు భాస్కర్,పోలీసు అధికారులు కోర్టు మానిటరింగ్ పోలీసులు పాల్గొన్నారు.

# నూతన విద్యా సంవత్సరం ప్రారంభం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** 2026–2027 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థిని–విద్యార్థులందరికీ టిపిసిసి సీనియర్ నాయకులు, సుప్రీంకోర్టు అడ్వకేట్ కొమిరెడ్డి కరంచంద్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు ఆయన సోమవారం హైదరాబాదు నుంచి చరవాణి ద్వారా మెట్‌పల్లిలోని స్థానిక విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విద్యాలయాలు తిరిగి ప్రారంభం కానున్నాయని పేర్కొం టూ, కొత్త విద్యా సంవత్సరంలో అమలు చేయనున్న పథకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే సమీక్షించి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ప్రభు త్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యం లో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు తప్పనిసరిగా హాజరయ్యేలా బాధ్యత వహించాలని కోరారు.తమ తల్లిదండ్రులు, మాజీ శాసన సభ్యులు స్వర్గీయ కొమిరెడ్డి రాములు, స్వర్గీయ జ్యోతక్కల ఎమ్మెల్యే పదవీకాలంలో నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. వారు విద్యా వ్యవస్థతో బలమైన అనుబంధం కలిగి ఉండి, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరక్షరాస్యత నిర్మూలన లక్ష్యంగా గ్రామాల నుంచి పట్టణాల వరకు పాఠశాలల స్థాపనకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన అన్నారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్తును మెరుగుపరచాలని కోరారు.

## అమ్మమాట– అంగన్వాడీ బాట

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి సెక్టారు లోని అంగన్వాడీ 4వ కేంద్రంలో సోమవారం అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంతో కూడిన విద్యను అందించడమే కాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ సెంటర్లో చేర్పించాలని సూచించారు.సెక్టార్ సూపర్వైజర్ స్వప్న మాట్లాడుతూ ప్రయివేటు స్కూల్ వద్దు అంగన్వాడీ ముద్దు అనే నినాదంతో పిల్లలను అంగన్వాడీ సెంటర్లో చేర్పించి వారి శారీరక,మానసిక ఎదుగుదలకు పాటు పడాలని కోరారు.అనంతరం అంగన్వాడీ టీచర్లు,విద్యార్థులతో పట్టణంలోని ప్రధాన రహదారుల గూండా ర్యాలీ నిర్వహించారు.

## పాఠశాలలు పునః ప్రారంభం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు జూన్ 15 సోమవారం రోజున పునః ప్రారంభమయ్యాయి. కాగా ప్రభుత్వ పాఠశాలల కు విచ్చేసే విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠశాలను ప్రత్యేకంగా అలంకరించి వెల్కమ్ బోర్డులను ఏర్పాటు చేసి ఘనంగా స్వాగతం పలికారు. 45 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు విద్యార్థులతో సందడిగా మారాయి.

## ఉత్తమ పాత్రికేయ పురస్కార గ్రహీత బాసెట్టి హరీష్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ఇటీవల శ్రీకాళహస్తిలో తెలుగు జాతీయ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పాత్రికేయ పురస్కారం అందుకున్న ప్రముఖ జర్నలిస్ట్ బాసెట్టి హరీష్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంట ప్రణయ్, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షుడు షేర్ భరత్, ఫిషర్‌మెన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పల్లికొండ ప్రవీణ్, గడప విమల్, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎశమేని గణేష్ తదితరులు హరీష్‌కు పూలమాలలు,శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.నాయకులు మాట్లాడుతూ జర్నలిజం రంగంలో బాసెట్టి హరీష్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

## భక్తుల ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** అతి పురాతన ఆలయంగా పవిత్ర కొండపైన వెలసిన శ్రీ కనక సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రోజున భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకార్చనలు జరిపించారు. ఉదయం నుండే భక్తులు కాలినడకన ఎత్తైన కొండపైకి చేరుకుని పవిత్ర కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి సోమేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కొండ కింద దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారం

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి మాట్లాడారు.పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ అధికారి ప్రసాద్,జగిత్యాల ఆర్డీవో మధు సూదన్,తదితరులు ఉన్నారు.

## విద్య పేరుతో దోపిడీ:

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి – బిజెవైఎం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేసి పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని బీజేవైఎం నాయకులు ఆరోపించారు.కనీస మౌలిక వసతులు లేకపోయినా కార్పొరేట్ స్థాయి ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు,యూనిఫాంలు,టైలు,బెల్టులు, షూస్ తదితర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని వారు పేర్కొన్నారు. అలాగే విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సిన నిబంధనను పలు పాఠశాలలు అమలు చేయడం లేదని ఆరోపించారు.ఇలాంటి విద్యాసంస్థల యాజమాన్యాలపై సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేవైఎం నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి గోపినావేణి రమేష్, అధికార ప్రతినిధి బొడ్డ నరేష్,నూనె క్రాంతి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ నగర్ జెడ్‌పిహెచ్ఎస్‌లో మౌలిక సదుపాయాలు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని శివాజీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూత్రశాలల లేమితో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల విషయాన్ని వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమస్యపై ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించడంతో పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మించిన మూత్రశాలలను మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ , మండల ఎమ్ఇఒ కనకతార,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు కలిసి ప్రారంభించారు.అనంతరం పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను జువ్వాడి నర్సింగ్ రావు శాలువాతో సన్మానించారు. అలాగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.అథ్లెటిక్స్‌లో విజయం సాధించిన ఓ విద్యార్థినికి కంటి చూపు సమస్య ఉన్నట్లు తెలియడంతో, ఆమెకు హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు చేయిస్తానని జువ్వాడి నర్సింగ్ రావు హామీ ఇచ్చారు.విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌కు రావాలని మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కోరారు.పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని జువ్వాడి నర్సింగ్ రావు తెలిపారు.

## సిమెంట్ బెంచీల వితరణ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** కోర్టులో క్లయింట్ల వేయిటింగ్ కోసం ఏర్పాటు చేసిన నాలుగు సిమెంట్ బెంచీలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లయింట్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మీడియేషన్ కోఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్,బక్కూరి రమేష్,తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్ ఈ విషయాన్ని నితిన్ చారిటబుల్ ట్రస్ట్‌కు తెలియజేయగా, ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. రాణావేన సత్యనారాయణ వెంటనే స్పందించి బెంచీలను అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్లయింట్ల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేయడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు గంధ్ర ప్రవీణ్ రావు,పోలకొండ దయాకర్ వర్మ, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మి రెడ్డి, వంగరి గంగరాజం,పులి నర్సయ్య,పుప్పాల లింబాద్రి, నేరెళ్ల శ్రీధర్,పడిగేల శ్రీనివాస్, మార్న వంశీ, గజెల్లి రాందాస్, అలాల శంకర్, కదారి యుగంధర్,తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు:ఎస్పి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :**బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు గ్రీవెన్స్‌డే ను ఏర్పాటు చేసినట్లు జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి అశోక్ కుమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,తదితరులు ఉన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం మండల ఆధ్యక్షుడిగా దగ్గుల వీరేశం ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/బీర్‌పూర్:** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల ఉప సర్పంచ్ ల శ్రీ కృష్ణ యాదవ సంఘం లో సమావేశంలో ఉప సర్పంచ్ ల జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ దగ్గుల వీరేశం ఉపాధ్యక్షులు గా నారపాక రమేష్ ప్రధాన కార్యదర్శి గా తర్లల మల్లేశం కోశాధికారి గా జక్కుల నాగరాజు సలహాదారుగా శీలం లింగన్న గౌడ్ ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఉప సర్పంచ్ లు ప్రకటించారు.వీరి నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్‌ల ఫోరం మండల ఆధ్యక్షుడు దగ్గుల వీరేశం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల ఐక్యతకు హక్కుల సాధనకు కృషి చేస్తానని అన్నారు.తన నియామకానికి సహకరించిన మండల ఉపసర్పంచ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలతో సమావేశం

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో డిఆర్‌డిఒ పిడి రఘువరన్ ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం అయ్యారు. అనంతరం మొక్కలు నాటారు. కూలీ డబ్బులు ఎంత వస్తున్నాయి. ఎంత టైం వరకు పని చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఎన్‌డబ్ల్యుఎం 2026 విషయాలు కూడా వివరంగా కూలీలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మహమ్మద్ సలీం, స్థానిక సర్పంచ్ అరుణ శేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉపాధి హామీ సిబ్బంది మనోజ్, శ్రీలత, శివ, కోటి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఫీల్డ్ ఛానెల్‌ను ప్రారంభించిన సర్పంచ్ కోలపాక రాధ రాజు

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలోని ఫీల్డ్ ఛానల్‌ను సోమవారం సర్పంచ్ కోలపాక రాధ రాజు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు పొలాలకు వెళ్లే ఫీల్డ్ ఛానెల్స్ ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, పాలక వర్గం, మెట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మేలకుంట శిఖం చెరువును కబ్జా నుంచి కాపాడాలి

## కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఫార్వర్డ్ బ్లాక్

**ప్రజాపక్షం / కొత్తపల్లి:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని సీతారాంపూర్ శివారులో గల మేలకుంట చెరువు శిఖం సర్వే నం.71 ప్రభుత్వ భూమిని అక్రమ కబ్జాల నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కామెర బద్రినేతతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. చెరువు పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేసి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ హద్దులను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ మున్సిపల్ అధికారులను ఆదేశించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ సర్వే నం.71లోని మేలికుంట శిఖం ప్రభుత్వ భూమి మొత్తం విస్తీర్ణం 13 ఎకరాల 26 గుంటలు భారీగా కబ్జాకు గురవుతున్న విషయమై నగర ప్రజల తరపున కలెక్టర్ దృష్టికి అధికారిక నివేదికలను బేఖాతరు చేస్తూ కబ్జాలు గతంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, చొప్పదండి, కరీంనగర్ రూరల్ సర్వేయర్లు సంయుక్తంగా సర్వే నిర్వహించారని దాదాపు 40 మందికిపైగా అక్రమార్కులు ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించి రెసిడెన్సియల్ భవనాలు, ఫంక్షన్ హాల్లు, విద్యా సంస్థలు, బెస్మెంట్లు నిర్మించారని ఆర్డీవో స్పష్టమైన నివేదిక ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇంకా పెద్ద పెద్ద భవనాలు, రోడ్లు నిర్మిస్తూనే ఉన్నారని అన్నారు. కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారి చెరువును తలపిస్తూ ట్రాఫిక్ స్తంభించి స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని అన్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేయాలని మేలకుంట చెరువు శిఖం భూమికి ఇప్పటివరకు హద్దులు నిర్ణయించకపోవడం వల్లే ఈ అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. తక్షణమే హద్దుల పిల్లర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలిస్తూ శిఖం భూముల్లో అధికారులు ఏ రకంగా నిర్మాణ అనుమతులిచ్చారో ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** విద్యుత్ వినియోగ దారులకు ఈ నెల 18 తారీఖున సమస్యల పరిష్కార వేదిక గురువారం నిర్వహించనున్నారు.సాధువెంకటరెడ్డి ఫంక్షన్‌హాల్ లో గంబీరావుపేట,వీర్నపల్లి,ముస్తాబాద్ మండలాల ప్రజలు విద్యుత్ సమస్యలకు సంబంధించిన సమస్యలను తెలుపుకోవచ్చునని,పరిష్కారం దిశగా వెంటనే సమస్యకు బదులు తెలుపనున్నట్లు టిజి ఎన్‌పిడిసిఎల్ రాజన్నసిరిసిల్లా జిల్లా సర్కిల్ సుపరిండెంట్ ఇంజనీర్ వేణుమాదవ్,డివిజన్ డిఇ అంజయ్య తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రతివినియోగదారుదు హాజరై తమ సమస్యలను తెలుపుకోవచ్చునని అన్నారు.విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో నిజామాబాద్‌కు చెందిన ఎన్‌పిడిసిఎల్ అధికారులు చవాన్ జయవంత్‌రావు, రాజుగౌడ్ హాజరవుతారని అన్నారు.

## ఎన్‌టిపిసి అధికారులతో ఆర్జి త్రీ జిఎం సమీక్ష

**ప్రజాపక్షం/రామగిరి:** సోమవారం సింగరేణి జిఎం కార్యాలయం నందు రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ఎన్‌టిపిసి జనరల్ మేనేజర్(ఒ & ఎం) మనీష్ అగర్వాల్ తోపాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బొగ్గు నాణ్యత, రవాణా మొదలగు అంశాలపై చర్చించారు . ఆర్జి త్రీ జి.ఎం మాట్లాడుతూ నాణ్యమైన బొగ్గు రవాణా సకాలంలో చేయడానికి ఎన్‌టిపిసితరపున సహాయ సహకారాలు అందించాలని, అందుకు పరస్పరంగా సానుకూలంగా వ్యవహరించుకోవాలని కోరారు. అందుకు ఎన్‌టిపిసిఅధికారులు బొగ్గు రవాణాకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఓటుజిఎం ఎం.రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ ఏ.ఉదయ భాస్కర్, నాణ్యత అధికారి ఆసిఫ్ యాసిన్, ఎన్‌టిపిసి అధికారులు హేమంత్ షిండే,ప్రసాద్ మండది, అటల్ గైక్వాడ్ ,రాధాకృష్ణ,దస్తగిరి, పాల్గొన్నారు.

## స్వర్ణకారుల మండల అధ్యక్షుడిగా అశోక్ చారి ఏకగ్రీవం

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో మండల నూతన అధ్యక్షుడిగా ఆకోజు అశోక్ చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే ఈ నూతన కమిటీ జనరల్ సెక్రెటరీగా రామగిరి సత్యనారాయణ, కోశాధికారిగా ఆకోజు జగదీశ్వర్ చారిలను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులతో పాటు కమాన్‌పూర్ మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ ఎల్లప్పుడూ ముందుండాలని,సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఆకోజు రమేష్, నాగభూషణం, ప్రకాశం, మధుకర్, సతీష్, మహేష్, చంద్రమౌళి, దేవేందర్‌తో పాటు మండల విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ,స్వర్ణకారులుఅధికసంఖ్యలోపాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల నీటి భద్రత కోసం పోరాడుదాం

### సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నర్మాల ప్రాజెక్టు మనుగడ భవిష్యత్ తరాల నీటి భద్రత కోసం మనమందరం కలిసి పోరాడుదామని రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. సోమవారం గంభీరావు పేట నర్మాల ఎగువ మానేరు గెస్ట్ హౌస్‌లో నర్మాల ప్రాజెక్టు పరిరక్షణకై గుంటి వేణు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎగువ మానేర్ లో 75 ఏళ్ల నుండి పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని శిథిలావస్థలో ఉన్న కాలువలకు తక్షణమే మరమ్మత్తులు చేసి కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు రక్షణ కోసం అప్రాన్ నిర్మాణం చేపట్టేందుకు పోరాటం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. నక్క వాగు ప్రాజెక్టును ఎగువ మానేర్ లో అనుసంధానం చేయాన్నారు. నాలుగు జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్ ను టూరిజం పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దాలని కోరారు. జిల్లా జేవీసీ చైర్మన్ బొజ్జ కనకయ్య మాట్లాడుతూ కలిసి వచ్చే వారిని కలుపుకుందాం కలిసి రానివారిని ఎండగడుదామన్నారు. రైతుల కోసం ఉద్యమం చేస్తేనే సమస్యలను సాధించుకోవచ్చునన్నారు. ప్రజా సంఘాల నాయకులు మానేరు పరిరక్షణ కమిటీ లో చేరి మానేర్ ప్రాజెక్టును కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పరిరక్షణ సమితి కన్వీనర్ ఓరుగంటి తిరుపతి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు మదాల కుమార్,స్వామి,మార్వాడి సుదర్శన్, అడ్వకేట్ సాయి ,చంద్రం, మాజార్, వేణు,గౌస్‌మొద్దీన్,రమేష్,ద్యాప దేవయ్య,బండారి బాల్ రెడ్డి, వెంకట్,కూర సురేష్ , పెద్ది గారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎడ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఫిర్యాదు



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ నిబంధనలకు విరుద్ధంగా పెద్దపల్లి కేంద్రంలో కొనసాగుతున్న క్రీసెంట్ బిఎడ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ అనుమతి మేరకు పట్టణంలోనే కొనసాగాల్సిన కళాశాలను వేరేచోటికి మార్చినారని, ఇటీవల పలు పత్రికల్లో కళాశాలకు వ్యతిరేకంగా కథనాలు ప్రచురితం కావడంతో తిరిగి పెద్దపల్లిలోని క్రీసెంట్ పాఠశాల ప్రాంగణంలోకి తీసుకువచ్చారని తెలిపారు.ఎన్‌సిఇటి నిబంధనల ప్రకారం కళాశాలను ఒక ప్రాంగణం నుండి మరో ప్రాంతానికి తరలించడానికి అనుమతిలేదన్నారు.కళాశాలలో ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, సైకాలజీ ల్యాబ్, లాంగ్వేజ్ ల్యాబ్,మెథడాలజీ ల్యాబ్,సరిపడ గ్రంథాలయం, విద్యార్థులకు అవసరమైన విద్యా వాతావరణం లేదని, ప్రతి సెమిస్టర్‌కు కనీసం 100 రోజుల తరగతులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో తరగతులు సక్రమంగా జరగడంలేదని వివరించారు. నకిలీ హాజరు రికార్డులు నిర్వహించడం, హాజరు లేకుండానే పరీక్షలకు అనుమతించడం, టీచింగ్ ప్రాక్టీస్ కేవలం కాగితాలకే పరిమితం కావడం, ప్రాక్టికల్స్,డిసర్టేషన్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడం, మార్కుల నమోదు, విద్యా రికార్డుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.అధికారులు సమగ్ర విచారణ చేపట్టి కళాశాల గుర్తింపు రద్దుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి పెద్దపెల్లి జిల్లాలో అదనపు కలెక్టర్ రెవెన్యూగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ముత్తారం మండలం లక్కారం గ్రామ పంచాయతీ కు చెందిన వీరగొని రాజేశం మచ్చ పేట గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 79 లో ఎకరం 33 గుంటల వ్యవసాయ భూమి చట్టబద్ధంగా కొనుగోలు చేయడం జరిగిందని,తన భూమిని అధికారికంగా పునః సర్వే చేయించి సంబంధిత రెవెన్యూ రికార్డులలో ఉన్న తప్పులను సరిచేసి చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఓదెల గ్రామ పంచాయతీ పరిధిలో మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూల్ సెంటర్ ను హై స్కూల్ ప్రాంగణంలోకి మార్పు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కనకిరెడ్డి సతీష్ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గోదావరిఖని కళ్యాణ్ నగర్ కు చెందిన కొత్తపల్లి సమ్మక్క తన ఇంటి వెనకాల ఉన్న కోత్వాల్ వెంకటేష్ అక్రమంగా మా ఇంటి సరిహద్దులను ఆక్రమంగా చొర పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దపల్లి పట్టణం ప్రగతి నగర్ కు చెందిన కొండా రమాదేవి తమకు గృహ జ్యోతి పథకం కింద లబ్ధి చేకూర్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపీడీఓ కు రాస్తూ అవసరాన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం ఏర్పాట్లు : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్





**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మొహరం సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మొహరం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో వివిధ శాఖల అధికారులతో సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీ.గడ్డం నగేష్ మాట్లాడుతూ జిల్లాలోని అషూర్ ఖానాలలో పరిశుభ్రత పనులు చేయించాలని, విద్యుత్ దీ పాలు, నీరు అందుబాటులో పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా ఏర్పాట్లు చేయించాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**అర్జీలు సకాలంలో పరిష్కరించాలి**

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 205 వచ్చాయి. ఐడిఓసి ప్రజావాణిలో డీఆర్ఓ జయశ్రీ, హౌసింగ్ పిడివెంకట మాధవరావు పాల్గొన్నారు.

## వృద్ధుల సంరక్షణ కుటుంబ సభ్యుల బాధ్యత

**ప్రజాపక్షం /పెద్దపల్లి రూరల్ :** వృద్ధుల సంరక్షణ కుటుంబ సభ్యుల బాధ్యత అని పెద్దపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ లో గల రెడ్డి వృద్ధాశ్రమంలో ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధుల హక్కులు, సంక్షేమ చట్టాలు,వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల వారి సంతానం ప్రేమానురాగాలతో ఉండాలని సూచించారు. వృద్ధుల ఆలనా పాలనా చూసుకోకపోతే చట్ట ప్రకారం చర్యలుంటాయని తెలిపారు.వృద్ధుల సంరక్షణ, సంక్షేమానికి చట్టాలున్నాయని, ఏదైనీ సమస్యలుంటే వృద్ధులు న్యాయ సహాయం పొందే అవకాశాలను వివరించారు. వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయని సంతోషపడాలా లేక వృద్ధులను, తల్లిదండ్రులను వదిలేస్తున్నారని బాధపడాలా అర్థం కావట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధాశ్రమాలకు వెళ్లే పరిస్థితి లేని సమాజం నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమాల్లో సర్పంచ్ తాడిశెట్టి చామంతి శ్రీకాంత్, తహసీల్దార్ రాజయ్య, రూరల్ ఎస్ఐ శ్వేత, న్యాయవాది సత్యనారాయణ రెడ్డి, విశ్రాంత ఎల్ఐసి అధికారి అశోక్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సోమావతి అమావాస్య పూజలు

**ప్రజాపక్షం/జమ్మికుంట :** అధిక జేష్ట మాసం చివరి రోజు శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం బొమ్మల గుడి జమ్మికుంటలో సోమావతి అమావాస్య సందర్భంగా అన్నపూర్ణాదేవికి అన్నపూర్ణ సేవా సమితి మహిళలు భవానీ భజన మండలి మహిళా బృందం లక్ష్య కనకాంబర పుష్పార్చన, లలితా సహస్ర పారాయణము, విష్ణు సహస్ర పారాయణము, లలిత సంపుటి పారాయణము నిర్వహించబడింది. మండలేముల వేణుగోపాల్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రతువులో భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. అనంతరం దాతల సహకారంతో అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వార్డు కౌన్సిలర్లు చందా రాజు, దిద్ది రాము, శ్రీపతి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజల వద్దనుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులు స్వీకరించారు, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.

# దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్ :** భూభారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సీసీఎల్‌ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత రికార్డులు, ఆధార పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి నాయక్ వాడి కలెక్టరేట్ డీ సూపరింటెండెంట్ మోబిన్‌తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# నూతన అధ్యక్షురాలిగా శరణ్య యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/రామగిరి :** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ప్రస్తుత అధ్యక్షులు లయన్ మేకల మారుతి యాదవ్ పదవీ కాలం జూన్ 30తో ముగియనుంది. 2025–2026 సంవత్సరంలో ఆయన నాయకత్వంలో క్లబ్ నిర్వహించిన విశిష్ట సేవా కార్యక్రమాలను గుర్తించి, లయన్స్ ఇంటర్నేషనల్ గ్లోబల్ కాజ్ అయిన హంగర్ రిలీఫ్ (ఆకలి నివారణ కార్యక్రమాలు) విభాగానికి జిల్లా క్యాబినెట్ చైర్‌పర్సన్‌గా నియమించడం జరిగింది.ఈ సందర్భంగా 2026–2027 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గ ఎన్నికలు లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ కావేటి రాజగోపాల్, జోన్ చైర్మన్ భాస్కర్ రావు గార్ల ఆధ్వర్యంలో నిర్వహించగా, క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా డా. శరణ్య యాదవ్‌ను నూతన అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు.అలాగే ప్రధాన కార్యదర్శిగా అబ్బు కేశవ రెడ్డి, కోశాధికారిగా టీవీ సురేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్లుగా దుబ్బాక సత్యంరెడ్డి, బుర్ధర్తి బుచ్చన్న పటేల్, , గ్లోబల్ కాస్ కోఆర్డినేటర్‌గా మొల్కురి శ్రీనివాస్, ఐ విజన్ పర్మినెంట్ ప్రాజెక్ట్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా గంట వెంకటరమణ రెడ్డి, ఫ్యామిలీ & ఉమెన్ కోఆర్డినేటర్‌గా మర్రి శరణ్య, క్లబ్ యాక్టివిటీస్ కోఆర్డినేటర్‌గా మాచర్ల లావణ్య, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ కోఆర్డినేటర్‌గా పట్నం వసుంధర, అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్‌గా ప్రీతి, స్కూల్ యాక్టివిటీస్ కోఆర్డినేటర్‌గా జి. సత్యనారాయణ, ఫార్మర్ సపోర్ట్ యాక్టివిటీ కోఆర్డినేటర్‌గా గుండా శ్రీనివాస్, క్లబ్ సర్వీస్ కోఆర్డినేటర్ కొప్పుల శ్రీపాద రావు,క్లబ్ మార్కెటింగ్ చైర్ పర్సన్ మారుపాక సాగర్, పర్యావరణ యాక్టివిటీస్ చైర్ పర్సన్ చింతిరెడ్డి సదారెడ్డి, అవేర్నెస్ ప్రోగ్రామ్ ఇంచార్జి కొట్టె రాజ్‌కుమార్,మెంబర్షిప్ కోఆర్డినేటర్‌గా దొడ్డ శ్రీనివాస్‌లను ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, జూన్ 21న సెంటినరీకాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ లో సాయంత్రం 6గంటలకు జిల్లా మాజీ గవర్నర్ డా. విజయ రేకులపల్లి గారిచే ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ బడిలో సర్పంచ్ కుమారుడిని చేర్పించి

ఆదర్శంగా నిలిచిన మచ్చుపేట సర్పంచ్!



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రభుత్వ విద్యపై నమ్మకం పెంచేలా ప్రజాప్రతినిధి నిర్ణయం గ్రామ ప్రజలంతా తమ పిల్లలను సర్కారు బడికే పంపాలని సర్పంచ్ చిలువేరి జ్యోతి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.సమాజంలో రోజురోజుకూ ప్రైవేట్ విద్యాసంస్థల మోజు పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో.. మచ్చుపేట సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్ దంపతులు తమ కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సమాజానికి ఆదర్శంగా నిలిచారు.ఒక ప్రజాప్రతినిధి హోదాలో ఉంటూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా వారు తీసుకున్న ఈ నిర్ణయం స్థానికంగా అందరి ప్రశంసలు అందుకుంటోంది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు,ఉచిత పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకంతో పాటు మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు.సర్కారు బడుల్లో లభించే నాణ్యమైన విద్యతో పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి.ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి గ్రామస్తులంతా కలిసికట్టుగా ముందుకు రావాలి.ప్రజాప్రతినిధులు స్వయంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు వస్తుందని ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీధర్ ఆదేశాలతో ఫిషరీస్ ల్యాండ్ సర్వే పూర్తి



కబ్జాదారులపై చర్యలు తప్పవు:
పోతరవేని క్రాంతి హెచ్చరిక

**ప్రజాపక్షం/మంథని :** మంథని మున్సిపల్ పరిధిలోని అయ్యగారి చెరువు పక్కన గల మత్స్యశాఖ భూముల సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సర్వే నెంబర్ 20 లోని ఒక ఎకరం 38 గుంటల ఫిషరీస్ పాండ్ ల్యాండ్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే చేశారు.ఈ సందర్భంగా మంథని మత్స్యశాఖ అధ్యక్షులు పోతరవేని క్రాంతి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, మత్స్యశాఖకు చెందిన విలువైన భూములను కొంతమంది కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.అలాంటి కబ్జాదారులకు ఇదే మా హెచ్చరిక అని, అక్రమార్కులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదన్నారు.ఫిషరీస్ ల్యాండ్ సర్వే సజావుగా సాగడానికి తక్షణమే ఆదేశాలు జారీ చేసిన స్థానిక శాసనసభ్యులు, మంత్రి శ్రీధర్ బాబుకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షించిన మంథని ఆర్డీఓ కి, తహశీల్దార్ కి మంథని మత్స్యశాఖ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో చేర్పించాలి

అమ్మ మాట అంగన్‌వాడి బాట'
కార్యక్రమంలో సర్పంచ్ కవిత



**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామంలో 3 ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలని సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామ పరిధిలో గల అంగన్వాడీ సెంటర్లో నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమం నిర్వహించగా సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.మూడేళ్ల నిండిన పిల్లలను, అంగనబడిలో చేర్పించడమేలక్ష్యంగా జూన్ 15 నుండి అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని అన్నారు.3 ఏళ్ల నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడిలో చేర్పించడం,స్వయం సహాయక సంఘాల మహిళలు,వివో ఏలు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించాలని అన్నారు.ఏపిఎం,సిసిలు ఈ కార్యక్రమ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు.పిల్లల భవిష్యత్తుకు పునాది వేసే ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులందరూ సామాజిక బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రజిత, మధుమతి తోపాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన వెంకట్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు.ఈ నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలుసుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# పెద్దపల్లిలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ తరగతులు



స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా శ్రీనుబాబు అవగాహన

**ప్రజాపక్షం /పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని శ్రీమయి కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ల బిఎల్ ఎ కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఏజెంట్లకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు హాజరయ్యారు.ఈ శిక్షణ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన SIR ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలను స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా చాలా స్పష్టంగా, క్షుణ్ణంగా వివరించారు.మంథని,రామగుండం,పెద్దపల్లి నియోజకవర్గాల నుండి హాజరైన బూత్ లెవెల్ ఏజెంట్లకు ఓటర్ల జాబితా సవరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన పద్ధతులపై ఆయన దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు, బిఎల్ఏ ఇంచార్జీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాయపడ్డ కార్మికుడిని పరామర్శించిన నాయకులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా పరిధిలోని జీడీకే 1 ఇంక్లయిన్ లో సోమవారం విధి నిర్వహణలో భాగంగా ప్రమాదానికి గురై గాయపడిన కోల్ కట్టర్ కనకం ప్రవీణ్‌ను గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.జీడీకే1 ఇంక్లయిన్ లో కోల్ కట్టర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్, చెట్ల కొమ్మలను కొట్టి తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు ఆ కొమ్మలు అతనిపై పడటంతో గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే సింగరేణి యాజమాన్యం మరియు గుర్తింపు సంఘం అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ఉప్పులేటి తిరుపతి స్పందించి, క్షతగాత్రుడిని తక్షణ చికిత్స నిమిత్తం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయపడిన కార్మికుడికి ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులకు వారు సూచించారు. ఆసుపత్రిలో ప్రవీణ్‌ను పరామర్శించిన వారిలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్,బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, మరియు ముఖ్య నాయకులు ఎస్. ఎం. చక్రపాణి,కారంపూరి వెంకన్న,గుర్రం ప్రభుదాస్,నందినరేశ్,పర్లపల్లి రామస్వామి,ఎర్రగొల్ల చేరాలు,తదితరులు ఉన్నారు.

## యోగా గొప్ప సాధనం



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : 21న జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం యోగా రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ రవీందర్ కుమార్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి మార్గదర్శి అని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవన విధానంలో యోగా మనకు ప్రశాంతతను, ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని చెప్పారు. ప్రతిరోజు కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి అనేక జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని ఆయన వివరించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక గొప్ప సాధనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ విజయమ్మ, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, నాయకులు మారుతి, ఆయుష్ సిబ్బంది సుజాత, శిల్ప పాల్గొన్నారు.

## త్వరితగతిన మున్సిపల్ కార్యాలయ నిర్మాణం

### అప్పాల గణేష్‌చక్రవర్తి



ప్రజాపక్షం/ నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణ ప్రజలకు మరింత మెరుగైన వేగవంతమైన పురపాలక సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మున్సిపల్ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాత మున్సిపల్ భవనం వెనుక భాగంలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న ఈ నిర్మాణ పనుల పురోగతిని ఆయన అధికారులతో కలిసి నిశితంగా పరిశీలించి, అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న పట్టణ జనాభా, అవసరాలకు అనుగుణంగా అన్ని ఆధునిక వసతులతో ఈ నూతన కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, పార్కింగ్, కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు ఉండేలా చూడాలన్నారు. పనుల్లో జాప్యాన్ని నివారిస్తూ నిర్దేశిత గడువులోగా భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ప్రాప్రతినిధులు, ప్రముఖ నాయకులు గోపు గోపి, పెండం శ్రీనివాస్, రాఘవేంద్రాచారి, గుంజాల చైతన్య, లక్కాకుల హరీష్‌లతో పాటు మాజీ కౌన్సిలర్ తోట నర్సయ్య, నల్లూరి పోశెట్టి, అడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




ప్రజాపక్షం/ వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా మంత్రుల సహకారంతో ఆలయ అభివృద్ధి చేస్తున్నాం. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజన్న ఆలయంలో కోడెలను కట్టే సంస్కృతి ఉంది. రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు జరుగుతున్నాయి. విటి డి ఏ వైస్ చైర్మన్ ,అధికారులు దేవాదాయ అధికారుల సమన్వయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, మరింత వేగంగా పనులను జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.రాజన్న ఆలయాన్ని పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారు.రాజన్న ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు కావాలన్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.రాజన్న భక్తులు ఎన్నో ఏళ్లుగా ఆలయాన్ని విస్తీర్ణం చేయాలని ఎదురుచూస్తున్నారు.ప్రజా ప్రభుత్వంలో అది నేడు నెరవేరుతుంది. ఆగమ శాస్త్రం ప్రకారం శృంగేరి పీఠాధిపతుల సూచనలతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం.నేడు అనిమిటి మండపం నిర్మాణ పనులు చేస్తున్నాం.స్వామివారి ప్రతిపాత్రమైన సోమవారం రోజున నిర్మాణ పనులు జరుగుతున్నాయి.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పని చేస్తూ ముందుకుపోతున్నారు.రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి.త్వరలోనే భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధూప, దీప, నైవేద్య జిల్లా అర్చక సంఘం సమావేశం



ప్రజా పక్షం/ వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం సమావేశాన్ని వేములవాడ గాయత్రి మాత దేవాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా అధ్యక్షుడు మరిగంటి కొండమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు సలహాలు సూచనలతో, అర్చకుల అభ్యున్నతి ఉద్యోగ భద్రత, ఐడి కార్డులు, హెల్త్ కార్డులు, మంజూరు కొరకై తీర్మానం చేయడమైనది. వేములవాడ మండల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీచేసిన 6A టెంపుల్ దర్శన జీవోను అర్చకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పరాంకుశం రమేష్ మాట్లాడుతూ అన్ని మండలాల సహకారంతో జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేసుకోవడం అయిందని, ఈ సమావేశానికి హాజరు కాని మండలాల అధ్యక్షులు వచ్చే మాసంలో తప్పక హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు ఆంజనేయ శర్మ, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి వెంకటరమణాచార్యులు, క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు బాపురెడ్డి, చర్లపల్లి సీతారాములు, అర్చకులు రాములు, శ్రీకాంత్, భద్రయ్య, ప్రవీణ్, జవహర్ నాయక్, భాస్కర్, మధుసూదనాచారి, మిథున్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి గుట్టకు పర్యాటక శోభ



ప్రజా పక్షం/ వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దత్తత దేవాలయమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువైన నాంపల్లి గుట్ట త్వరలోనే పర్యాటక ఆకర్షణగా మారనుంది. గుట్టపై భారత వైమానిక దళానికి చెందిన విమానాన్ని ఏర్పాటు చేయడానికి చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విమానం విడిభాగాలను ప్రత్యేక వాహనాల ద్వారా గుట్టపైకి సోమవారం తరలించారు. పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్స్ విమానాన్ని ప్రతిష్ఠించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే విమానం ప్రధాన విడిభాగాలు గుట్టపైకి చేరుకోగా, వాటి ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. విమానం ఏర్పాటు పూర్తయిన తర్వాత నాంపల్లి గుట్టకు వచ్చే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రకృతి సోయగాలు, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన నాంపల్లి గుట్టకు ఈ విమానం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. విమానం ఏర్పాటు పూర్తయిన అనంతరం ఈ ప్రాంతం జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత గుర్తింపు పొందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయంతో కొనసాగుతున్న ఈ పనులు త్వరలో పూర్తికానుండగా, నాంపల్లి గుట్ట పర్యాటక శోభను సంతరించుకుని సందర్శకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది.

# అర్హులైన బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి

### టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట రాజన్న



ప్రజాపక్షం / భైంసా : తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ టియుసిఐ ఆధ్వర్యంలో కుబీర్ మండలం చాత గ్రామంలోని బీడీ సెంటర్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట రాజన్న మాట్లాడుతూ గత 54 ఏళ్లుగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ టియుసిఐ, బీడీ కార్మికుల హక్కులకై నిరంతరం పోరాడుతుందని తెలిపారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.15000 వేతనం దాటిన వారికి రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న ప్రొఫెషనల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలనిడిమాండ్ చేశారు. బీడీ కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన బీడీ కార్మికులకు రూ. 2016 జీవన భృతి అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం బీడీ కార్మికులను చిన్న చూపు చూస్తూ పరిశ్రమను అంధకారంలోకి నెడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు జీవన భృతి ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం కూడా రూ.6000 జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ ఇల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.బక్కన్న, రామ లక్ష్మణ్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: విద్యుత్ వినియోగ దారులకు సమస్యల పరిష్కార వేదిక గురువారం నిర్వహించనున్నారు.సాధువెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గంబీరావుపేట,వీర్నపల్లి,ముస్తాబాద్ మండలాల ప్రజలు విద్యుత్ సమస్యలకు సంబంధించిన సమస్యలను తెలుపుకోవచ్చునని,పరిష్కారం దిశగా వెంటనే సమస్యకు బదులు తెలుపనున్నట్లు టీజీ ఎన్‌పిడిసిఎల్ రాజన్నసిరిసిల్ల జిల్లా సర్కిల్ సుపరింటెండెంట్ ఇంజనీర్ వేణుమాధవ్,డివిజన్ డీఈ అంజయ్య తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రతివినియోగదారుడు హాజరై తమ సమస్యలను తెలుపుకోవచ్చునని అన్నారు.విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో నిజామాబాద్‌కు చెందిన ఎన్‌పిడిసిఎల్ అధికారులు చవాన్ జయవంత్‌రావు,రాజు గౌడ్ హాజరవుతారని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

### పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ



ప్రజాపక్షం / జన్నారం : నాణ్యమైన విద్య కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ కోరారు. జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నూతన విద్యా సంవత్సరం ఆరంభం సందర్భంగా విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల మీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందు నాయక్, టౌన్ అధ్యక్షులు మంద రాజేష్, పాఠశాల చైర్పర్సన్ రేణుక, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్.విజయ్ కుమార్, వార్డు సభ్యులు మద్రిపెల్లి అంజన్న, ప్రవీణ్, పాఠశాల ఉపాధ్యాయులు రాజేశం, శ్రీకాంత్, వనిత, సుజాత పాల్గొన్నారు.

## 'మనబడి పరిరక్షణ' టీం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

ప్రజాపక్షం / భైంసా : భైంసా పట్టణంలోని మన బడి పండగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మన బడి పరిరక్షణ టీం చైర్మన్ సుంకెట మహేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న డిజిటల్ తరగతులు, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించయాలని కోరారు. ఈ సందర్భంగా సుంకెట మహేష్‌బాబు మాట్లాడుతూ, మన ఊరి పిల్లల ఆరోగ్యం కూడా మన బాధ్యతే, మా పిలుపుకు స్పందించి సొక్షి మెటర్నిటీ హాస్పిటల్, ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ భైంసా యమాన్యాలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పూర్తిగా ఉచితంగా ఓపి సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి విశేషంగా స్పందించారు. ప్రచార కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్.యం.సి. సభ్యులు, మనబడి పరిరక్షణ టీం వాలంటీర్లు మనబడి పరిరక్షణ టీం సభ్యులు రామోతేవార్ గంగాప్రసాద్, యోగేష్, పవన్ కుమార్, నవీన్ లు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

### మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. కాగజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) సర్‌సిల్క్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) కాగజ్‌నగర్‌లో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు విలువలను పెం పొందించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాక శ్రీలత, ఆత్రం ప్రమీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల ఆసక్తిని కనబరచాలి



ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణం లోని 40వ వార్డులో ద్యావరశెట్టి రమేష్ జ్ఞాప కార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పాల్గొని విజే తలు, రన్నరప్ జట్టుకు బహుమతులు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ తమ ప్రతిభను ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. క్రీడలు, క్రమశిక్షణ, ఐక్యత, నాయ కత్వ లక్షణాలు మరియు ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొ న్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించిన ఆయన, భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిం చాలని ఆకాంక్షించారు. విజేతలు, రన్నరప్ జట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్సీరాజు, రాఘ వేంద్రాచారి, ఆడప పోశెట్టి, నాయకులు ఆడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలే బలమైన పునాది

సర్పంచ్ మడావి వెంకటేష్



ప్రజాపక్షం / కాసిపేట : పిల్లల భవిష్యత్తుకు పాఠశాలలే బలమైన పునాది అని, నూతన విద్యా సంవత్సరంలో అడుగుపెడుతున్న విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తాటి గూడ గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ ఆకాంక్షించారు. నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం కాసిపేట మండలం తాటిగూడ గ్రామపంచాయతీ పరిధి లోని దిశా మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలకు తొలిరోజు వచ్చిన చిన్నారులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఆత్మీయంగా ఆహ్వానించి విద్యా సంవత్సరానికి శుభారం భం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. తాటిగూ డ పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, విద్యా పురోగతికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, ఉప సర్పం చ్ తమ్మినేడి విజయలక్ష్మి, శ్యామ్ శేఖర్, ఉపా ధ్యాయురాలు రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ రూప, స్కూల్ చైర్మన్ మడావి లక్ష్మి, వీఓఏ రోడ్డ పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన విద్యా సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలి

జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య




ప్రజాపక్షం / జైపూర్ : నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య పిలుపునిచ్చారు. 2026–27 విద్యా సంవత్సరం తొలిరోజు సందర్భంగా సోమవారం ఆయన జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మాట్లాడారు. విద్యను జీవితంలో అత్యంత విలువైన ఆస్తిగా భావించి కష్టపడి చదివి ఎంచుకున్న రంగాల్లో రాణించా లని అదనపు కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌక ర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా గది తది తర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులు ప్రతి రోజూ పాఠ్యపుస్తకాలతో పాటు సాధారణ విజ్ఞానం, స్ఫూర్తి దాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, సాహిత్య పుస్తకాలు చద వడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యకలాపాలలో పాల్గొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అంది స్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, సర్పంచ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

మున్సిపల్ కమిషనర్ టి. రాజాలింగు



ప్రజాపక్షం / మందమర్రి : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని మున్సిపల్ కమిషనర్ టి. రాజాలింగు కోరారు. కొత్త విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ మందమర్రి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశా లల్లో సోమవారం విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. మండలంలోని ఎంపిపిఎస్ ఫిల్టర్ బెడ్ పాఠశాలలో నిర్వ హించిన పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశా లల్లో అనుభవజ్ఞులైన, అంకితభావం కలిగిన ఉపాధ్యా యుల సారథ్యంలో నాణ్యమైన విద్య అందుతుందని కమి షనర్ తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభోత్సవాన్ని పుర స్కరించుకుని విద్యార్థులకు పూలతో, బెలూన్లతో ఆహ్వానం పలుకుతూ ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగురంగుల బెలూన్లు అందజేసి, ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు శ్రీనివాసాచారి, పద్మజ, ఉపాధ్యాయులు ఉమా దేవి, భీంపుత్ర శ్రీనివాస్, లలిత, గుడివెనుక రవి, ఎపిపిసి చైర్‌పర్సన్ అంజలి, మున్సిపల్ కార్యాలయ డేటా ప్రాసె సింగ్ అధికారి బి. శ్యాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం

సర్పంచ్ పెంచాల మధు



ప్రజాపక్షం / మందమర్రి :పొన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల అభివృద్ధి కోసం పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని గ్రామ సర్పంచ్ పెంచాల మధు హామీ ఇచ్చారు. నూతన విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ పొన్నారం జడ్‌పిహెచ్‌ఎ స్‌లో సోమవారం విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశా లకు మంచి పేరు తీసుకొచ్చిన ఉపాధ్యాయులను సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు పాఠశాలలే బల మైన పునాది అని పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్స రంలో అడుగుపెడుతున్న ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదు వుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. విద్యార్థు లను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్ పెంచాల అమృత రాజలింగు, వార్డు సభ్యులు సంకే శ్రీనివాస్, సురిమిల్ల పద్మ శ్రీనివాస్, బోర్ల కుంట లక్ష్మణ్, మేకల వంశీ, బొజ్జ కుమారి, విద్యా కమిటీ చైర్మన్ గోగు సుమలత, పంచాయతీ కార్యదర్శి హరీష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌ను ఎత్తివేయాలని రైతుల రాస్తారోకో



ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండ లంలో యూరియా యాప్ ను తక్షణమే ఎత్తివేయాలని వందలాది మంది రాస్తారోకో నిర్వహించారు. మోర్తాడ్ మండలంలోని దొన్కల్ గ్రామగేట్ జాతీయ రహదారి 63 వద్ద సోమవారం రైతులు యూరియా యాప్‌ను తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ వందలాది మంది రైతులు రాస్తా రోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోలో మోర్తాడ్ మండలం లోని శెట్టిపల్లి, ధర్మోరా, దొన్కల్ గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు. పెంచిన మండల ధరలను తక్షణమే దించా లని కోరారు. అలాగే అన్ని సొసైటీలలో యూరియా అందు బాటులో ఉంచాలన్నారు. జాతీయ రహదారి 63పై దాదాపు రెండు గంటల పాటు రైతులు బైఠాయించి రాస్తా రోకో నిర్వహించడంతో ఆర్మూర్ నుంచి మెట్పల్లి దిక్కు, మెట్పల్లి నుంచి ఆర్మూర్ దిక్కు వాహనాలలో వెళ్లే ప్రయాణి కులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జిల్లా కలెక్టర్ ఇక్కడికి రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిఘన్ మాల్వియా అక్కడికి చేరుకున్నారు. సబ్ కలెక్టర్ రైతులకు సముదాయించినప్పటికీ యూ రియా యాప్‌ను తక్షణమే ఎత్తివేసి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని సబ్ కలెక్టర్ హామీని వ్వడంతో రైతులు శాంతించి రాస్తారోకో విరమించారు. పోలీసులు మోర్తాడ్ బస్టాండ్‌లోనే కొన్ని వాహనాలను నిలిపి వేసి కొన్ని వాహనాలను దారి మళ్లించి పంపిం చారు. దొన్కల్ గేటు వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వ హించారు. సబ్ కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి శ్రీని వాస్, మోర్తాడ్ తహసీల్దార్, స్థానిక అధికారులున్నారు.

## పేద విద్యార్థులకు విద్య దూరం



ప్రజాపక్షం / భైంసా : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా ఎబివిపి ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్ మాట్లాడుతూ, భైంసా నగరంలో పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా ట్రాస్మా పనిచేస్తుంది. నగరంలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూల్లో అధిక ఫీజులు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, పెన్నులు పెన్సిళ్ళు, అమ్ముతు న్నారు. మేము విద్యా సేవలు అందిస్తున్నాము అని బూటకపు మాటలు చెప్పుకొని విపరీతమైన దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. విద్యాశాఖాధికారులు కూడా ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలు కుతున్నారు. కొన్ని ప్రైవేటు స్కూల్స్ దోపిడీకి పాల్పడి విద్యను వ్యాపారంగా మార్చుకుంటున్నారు. విద్యార్థి సంఘాలు పేద విద్యా ర్థుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుంటాయన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కన్వీనర్ మడపల్లి దినేష్ జిల్లా నాయకులు అక్షయ్, కార్తిక్, అజయ్, రాంచరణ్, గౌతం, సందీప్, మధు, గణేష్, దుర్గా దాస్, వర్మ అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

విద్యను బలోపేతం చేయాలని డిమాండ్



ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : విద్యా రంగంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ రోజు విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ విద్యార్థి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు , ప్రతినిధులు భారీగా హాజరై విద్యా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల సమ స్యలను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయా లన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని మండిపడ్డారు. విద్యార్థులు, తల్లి దండ్రులపై ఆర్థిక భా రాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. అలాగే, జిల్లా విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించే దుకు, గతంలో నిర్మల్‌లో పనిచేసిన పీజీ కళాశాలను తిరిగి పునః ప్రారంభించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కా ర్యదర్శి కైలాస్, ఉపా ధ్యక్షుడు అస్లాం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దిగంబర్, ఎబివిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, పిడి ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు కిరణ్, బిఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు సోయబ్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రత్నాపూర్ కాండ్లి పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్ర మంలో భాగంగా పాఠశాలల పునఃప్రారంభ దినోత్సవాన్ని పురస్క రించుకొని, నిర్మల్ జిల్లా విద్యాశాఖాధికారి ఈ రోజు నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన విద్యా ర్థినీ, విద్యార్థులకు ఆయన పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు నూతన విద్యా సంవ త్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ స్వయంగా అందజేసి, వారిని ఆశీర్వదించారు. ప్రభుత్వ పాఠశా లల్లో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా బడిబాట కార్య క్రమం నిర్వహిస్తున్నాము. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి, ఈ ఘన స్వాగతోత్సవ కార్యక్ర మంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే ఎరువుల పంపిణీ చేపట్టాలి

ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ : రివాల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ యూరియా పంపిణీ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే రైతులకు యూరియా ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

## పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ



ప్రజాపక్షం/బాల్కొండ : మండలంలోని చిట్టాపూర్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సట్ల గంగా ప్రవీన్‌కుమార్ విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని అంది పుచ్చుకుని చదువుల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సారెడ్డి, భృగు మహర్షి, రామారెడ్డి, శ్రీనివాస్, పద్మ, రాజేందర్‌గౌడ్, ప్రవీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 8 దరఖాస్తులు

ప్రజాపక్షం/బోధన్: నిజామాబాద్ జిల్లా బోధన్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 8దరఖాస్తులు నమోదు అయ్యాయని అధికారులు తెలిపారు. మున్సిపల్ పరిధిలో హౌస్ నంబర్ అలాట్‌మెంట్, డ్రైనేజీ సమస్య, విద్యుశాఖ లో స్కూల్ ఫీజు సమస్య, రైతు బంధు, ఇందిరమ్మ ఇల్లు, డెట్ సర్టిఫికెట్, భూమి సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్నారు.

## ఆలయ ప్రతిష్టకు మంత్రి అడ్లూరికి ఆహ్వానం



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ కాలభైరవ సహిత అష్టభుజ దుర్గాదేవి నూతన ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఆలయ కమిటీ సభ్యులు మండల కాంగ్రెస్ నాయకులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు .నూతనంగా నిర్మించిన శ్రీ కాలభైరవ సహిత అష్టభుజ దుర్గాదేవి ఆలయంలో ఈనెల 18 గురువారం మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు .ఈ సందర్భంగా ప్రతిష్ట ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ను కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపల్లి గంగన్న ,కాంగ్రెస్ నాయకులు ముస్కు నిశాంత్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు .

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారిగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా, ప్రజలు విద్యా, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యాప్ పేరుతో అన్నదాతలకు నరకం



ప్రజాపక్షం/భీమ్‌గల్ :రైతులకు అందించాల్సిన యూరియాను యాప్ పేరుతో కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని రైతులు మండిపడ్డారు. సోమవారం ముఖ్య స్వపల్ చౌరస్తాలో రైతులతో కలిసి బిఆర్‌ఎస్ పార్టీ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించి మాట్లాడారు. రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తూ వ్యవసాయాన్ని కుంటుపర్చేలా ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా మొబైల్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా యాప్ కారణంతో బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదముందని, రైతులు ప్రైవేట్ వ్యాపారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మండల వ్యాప్తంగా సరిపడా యూరియా ఇతర ఎరువుల నిల్వలను ప్రభుత్వం వెంటనే అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులకు శాపంగా మారిన యూరియా యాప్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో రైతాంగంతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 135 ఫిర్యాదులు



ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 135 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, భుజంగరావు, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, జడ్పీ సీఈఓ సాయిగౌడ్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున అన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 25 నుండి జూలై 24 వరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగనుందని ఈ ప్రక్రియ ప్రారంభం కావటానికి ముందే అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులందరూ బీఎల్ఓలను సంప్రదించి మ్యాపింగ్‌ను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీజనల్ వ్యాధుల నివారణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగగా కలెక్టర్ మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, విషజ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూ డా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మంచినీరు కలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని, నివాస ప్రాంతాల నడుమ పిచ్చి మొక్కలు, చెత్తచెదారం ఉం డకూడదని సూచించారు. మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రపర్చేలా చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమల వ్యాప్తి నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటిని ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు తప్పనిసరిగా సందర్శిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా చూ డాలని ప్రతి నివాస ప్రాంతంలో ఫ్రైడే డ్రై డే పక్కాగా అమలయ్యేలా చూడాలన్నా రు. పాఠశాలలు, వసతిగృహాలలో దో మల నివారణ చ ర్యలు చేపట్టాలని పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. పొగాకు నియంత్రణపై నిర్వహించిన జిల్లా సమన్వ య కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పొగాకు వాడకంతో కలిగే అనర్థాలపై విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. పొగాకు విక్రయాలకు సంబంధించి నిబంధనలు పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశాలలో అదనపు కలెక్టర్ భుజంగరావు, శిక్షణ కలెక్టర్ సురేష్, నగరపాలక సంస్థ కమిషనర్ ది లీప్ కుమార్, జిల్లా వైద్యారోగ్యాధికారిని డాక్టర్ రాజశ్రీ, సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, అధికారులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌చారికి సత్కారం

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : వారణాసి పుణ్యక్షేత్రం వేదికగా నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ సామాజిక వేత్త, విశ్వబ్రాహ్మణ సంఘం నేతకు అరుదైన గౌరవం దక్కింది. సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న నిరంతర సేవలను గుర్తిస్తూ వారణాసి (కాశీ)లో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో నిర్మల్ జిల్లా విశ్వబ్రాహ్మణ / విశ్వకర్మ మాత్ర సంఘం జిల్లా అధ్యక్షులు కత్రోజు అశోక్ చారికి ప్రతిష్ఠాత్మక గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని ప్రధానం చేశారు. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సంఘ సంక్షేమానికి అశోక్ చారి అందిస్తున్న సేవలను కొనియాడుతూ ట్రస్ట్ నిర్వాహకులు ఆయనకు ఈ గౌరవ డాక్టరేట్‌ను అందజేసి ఘనంగా సత్కరించారు. నిర్మల్ జిల్లాలో సామాజిక, సేవా కార్యక్రమాల్లో అశోక్‌చారి ఎల్లప్పుడు ముదుంటారని, సమాజ శ్రేయస్సు కోసం ఆయన పడుతున్న తపనకు ఈ పురస్కారం నిదర్శనమని ట్రస్ట్ ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి మార్గదర్శిగా నిలవాలని వారు ఆకాంక్షించారు. నిర్మల్ జిల్లా వాసికి కాశీ నగరంలో ఈ స్థాయి గౌరవం దక్కడం పట్ల జిల్లాలోని పలువురు ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అశోక్ చారికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## ఎరువుల కొరత లేకుండా చూడాలి

### బిజెపి నాయకుల వినతి



ప్రజాపక్షం/బోధన్: నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బిజెపి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా యాప్ మండలం యూనిట్‌గా కాకుండా సొసైటీ పరిధిలోని గ్రామాల యూనిట్‌గా తీసుకోవాలని, వీలైతే యాప్‌ను రద్దు చేయాలని, పలు సమస్యలను వారు చర్చించారు. మండలం యూనిట్‌గా ఉండటం వల్ల రైతులు విపరీతమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని, సాగునీటి సౌకర్యాలు మెరుగుపర్చాలని, పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా రైతుల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, రైతుల అభ్యున్నతికి బిజెపి ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వడ్డీ మోహన్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు అడ్లూరి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రాంచందర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీధర్, బోధన్ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, పట్టణ అధ్యక్షులు పసులోటి గోపి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌తో రైతులకు ఇబ్బందులు

ప్రజాపక్షం/ఎడపల్లి:ఎరువుల ఆన్‌లైన్ బుకింగ్ యాప్ కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బోధన్ నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి వడ్డీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వడ్డీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎరువుల కొనుగోలుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆన్‌లైన్ బుకింగ్ విధానం రైతులకు అనేక ఇబ్బందులను కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం, యాప్‌లో సాంకేతిక లోపాలు ఉండటం, బుకింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగడం వల్ల రైతులు సమయానికి ఎరువులు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆన్‌లైన్ విధానంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎరువుల సరఫరాను సులభతరం చేయాలని తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రామచందర్, ఎడపల్లి మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి శ్రీధర్, నాయకులు మల్లెపూల శ్రీనివాస్, సాయి వేణు, గెంటే శ్రీనివాస్, సృజన్, రాకేష్, సాయి, అరుణ్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.